# 4

# అంతర్వాహిని

"ఒరేయ్ కోటీ"—కోటిగాడు తనవేపు చూడ్డం చూసి 'ఇట్రా ఇట్రా' అని గట్టిగా పిలిచాడు బస్సు డ్రైవర్.

"ఒరే కోటిగా-ఇట్రారా-రారా' అని కేకేసి పిలిచాడు కండక్టరు, డ్రైవర్ కంటె వయసులోనూ, సంపదలోనూ పెద్ద తనమున్న ధైర్యంతో.

గొంతు చించుకొని అరుస్తేనేగాని వినిపించటంలేదు. వర్షం మోత అంత హెచ్చుగా ఉంది. బస్సుస్టాండు చుట్టూ వున్న పట్టణాన్ని కప్పేసేంత దట్టంగా ఉన్నాయి వర్షపు తెరలు. ఏడాది పొడవునా పేరుకున్న మురికినంతటినీ పావుగంటలో కడిగేసింది వర్షం. సైడు కాలువలు పొంగిపోయాయి రోడ్డు మీదికి. ఎర్రని కొత్తనీరు పల్లానికి పారుతోంది.

బస్సుస్టాండు దగ్గర్లోనే పెద్ద మర్రిచెట్టుంది. ఆ చెట్టు మాను చాటున సగం తడిసి, అక్కణ్ణించి కదల్లేక నుంచున్నాడు కోటి. డ్రైవర్ పిలుపూ వినబడ్డది. కండక్టరు పిలుపూ వినబడ్డది. వాళ్ళని చూశాడుకూడా. కాని అక్కణ్ణించి కదల్లేదు.

బస్సు స్టాండుకు ఆనుకునే విశాలమైన పాతకాలపు హోటల్ ఉంది. అక్కణ్ణించి హోటల్ యజమాని కృపాసింధు "వారే వెధవా, తడుస్తున్నావ్, రారా" అని పిలిచాడు.

కృపాసింధు వేపుకూడా చూశాడు. కాని ఆ చెట్టుచాటు నించి కదల్లేకపోయాడు. అటు దక్షిణానికి షెడ్డు, ఇటు పశ్చి

మానికి హోటల్ పాతికగజాల దూరంలోనే ఉన్నాయి. కాని అక్కణ్ణుంచి కదిత్తేచాలు తడిసి ముద్దయి పోయేట్టు వున్నాడు. అంచేత కదల్లేదు.

వాడికి మనుషులంటే భయం పట్టుకుంది. వాళ్ళదగ్గరికి వెళ్ళడమంటే బాధ. అందుచేతనే, ఆ పిరికితనంతోనే ఆ చెట్టుచాటున, ఆ తుంపర్లలో నానుతూ, వర్షాన్ని చూస్తూ నుంచున్నాడు.

హోటల్లో వెచ్చని కాఫీ చప్పరిస్తో సారథి కోటిని చూశాడు. ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగాయి. మళ్ళీ అంతలోనే ఆ ఉత్సాహం చల్లబడిపోయింది.

పిలిచిపిలిచి విసిగి పోయాడేమో కండక్టర్ "ఒరే దున్నపోతూ, రారా" అన్నాడు పళ్లు కొరికి.

అదే షెడ్డులోంచి "తడిస్చస్తున్నా వ్వెధవా, బుర్రలేదూ? ఇక్కడి కొచ్చి చావకూడదూ?" అన్నాడు డ్రైవర్.

క్లీనర్ ఒంటికన్ను నర్సింగులు వర్షపు జల్లులకి తడిసిపోయి నుంచున్న కోటిని చూసి ఒకటే పగలబడి నవ్వుతున్నాడు.

ఆ షెడ్డులో ఇంకా జనం ఉన్నారు. అంతా బలంగానూ, మోటుగానూ ఉన్నారు. అంతలో ఓ ఆడకుక్క ఎక్కణ్ణించో, ఎవరు కొట్టి తోలేస్తేనో బాగా తడిసి తలదాచుకోవటానికి లోపలి కొచ్చింది. అనారోగ్యంగా ఉన్నట్టుంది. ఊగుతో నడుస్తోంది. దాన్ని లోపలికి రానిచ్చి బూటుతో తన్నాడు డ్రైవర్. అది ఆతాపుకి అంత దూరంలో వర్షం నీటిలో పడింది. షెడ్డు గోడనించి ఊడుతోన్న ఇటుక తీసి దాంతో చావమోది, అది దిక్కులేని ఆక్రందనంతో పరుగు తీస్తే అంతా నవ్వారు. అక్కడి మనుషుల స్వభావాలకి ఆ సంఘటన ఉదాహరణ.

ఆ కుక్క కుయ్యో మొర్రో మంటో హోటల్ వేపు పరుగు తీయడం చూసి తననే హింసించినట్టుగా కోటి బాధపడ్డాడు.

"ఒరే దున్నపోతూ, గాడిదా, తడిసి జ్వరం పెట్టుకునేవ్! రారా షెడ్డులోకి-" అని మరోసారి తిట్టి, అసహ్యించుకొని పిలిచాడు కండక్టర్ కోటిని.

స్టాండులో వాళ్ళబస్సు తడుస్తోంది. ఏడెనమండుగురు ప్రయాణికులు ఆ బస్సులో ఉన్నారు. బస్సుకదలటానికి ఇంకా అరగంట టైం ఉంది. ఈ అరగంట కాలక్షేపం కోసం కోటిని పిలవడం తప్పించి నిజంగా వాడిమీద అంత సానుభూతి ఉండికాదు. తను ఆడించినట్లల్లా ఆడితే దానివలన మనిషిపొందే ఆనందం చాలాగొప్పది. చేప పిల్లని ఒడ్డున వేసి అది కొట్టుకుంటుంటే చాలా యిష్టం. తూనీగకి తాడుకట్టి వొదలడం ఇష్టం. ఎలక్కి మువ్వకట్టి ఆడించడం సరదా. కుక్క ముఖాన్ని కుండలో పెట్టి వొదిలి అది వెర్రి పరుగులు తీస్తే చూడ్డం ఆనందం. మరి తను ఆడించినట్లల్లా ఆడే మనిషే దొరికితే ఇంక చెప్పనక్కర్లేదు. కోటితో ఆడుకోవాలని వాళ్ళ సరదా. అంచేత వాళ్ళు పిలిచారు. కోటి కది తెలిసి రాలేదు. రాకుండా ఉంటే ఊరుకోరు. వెళ్ళి లాక్కొస్తారు.

ఆ బస్సు స్టాఫ్ వాళ్ళంతా అప్పుడే తిని వచ్చారు. కిల్లీలు బిగించి సిగరెట్లు కాలుస్తూ అక్కడ కూచున్నారు.

అప్పుడే ఓ బస్సు వచ్చింది. కొంతమంది ప్రయాణికులు దిగారు. షెడ్డులోంచి కొంద రెళ్ళిపోయారు. కొందరు లోపల కొచ్చేరు. ఆ వచ్చిన వాళ్ళల్లో ఒకాయన దగ్గర గొడుగుంది. ఆ గొడుగు చూసి, "నర్సింగులూ, ఆ ఆడమనిషి తడిసిపోతున్నాది. ఎల్లి చెయి సాయం చేయరా" అన్నాడు కండక్టరు.

నర్సింగులు కండక్టర్ ధోరణి అర్థం చేసుకున్నాడు. ఏ ఆట ఆడమంటే ఆ ఆట ఆడేరకం కాదు. కావలిస్తే వాళ్ళతోపాటు ఎవరి నన్నా ఆడించటంలో తోడ్పడగలడు. అందుచేత ఆ పాతికేళ్ళ అమ్మాయి వర్షంలో తడిసిపోతో అసహాయపరిస్థితిలో ఉన్నప్పటికీ, సాయం చేయాలని లోలోపల కోరిక ఉన్నప్పటికీ, అలాంటి పరిస్థితిలో సాయంచెయ్యడం అవసరం అని తెలిసినప్పటికీ హీ హీ హీ అని నవ్వేసి కదల్లేదు.

ఆమె తడిసిపోయింది. ఆమె సన్నటి గుడ్డలన్నీ వొంటికి అంటుకున్నాయి. ఆమె బెడ్డింగ్ కింద నీటిలో పెట్టేయాల్సి వచ్చింది. చివరికి ఆమే మోసుకుంటూ వెళ్ళింది, హోటల్ పంచకి.

తర్వాత కండక్టరుకి ఒక ఉపాయం తోచింది. కోటిగాడిని తీసుకురమ్మని నర్సింగులుకి పురమాయించేడు. ఒక ప్రయాణీకుడి దగ్గర గొడుగు తీసుకుని ఇచ్చాడు.

నర్సింగులు వెళ్ళి పిలిస్తే జడిసిపోయి, కోటి జంకి వెనక్కడుగు వేసేడు. గొడుగు చూపించి పిలిచే సరికి దాంట్లో దూరేడు. నర్సింగులు మధ్యవరకూ తీసుకెళ్ళి అక్కడ వర్షంలో కోటిని విడిచేసి తను గొడుగుతో షెడ్డులోకి పరుగుతీశాడు.

వర్షం కుండపోతగా ఉంది.

కోటికి కోపమూ, ఏడుపూ వచ్చి తిట్టాడు బూతులు. వెంటాడుతూ పరుగు తీశాడు.

"తగ్గరా కోటీ, తగ్గు"

"తగ్గరా"

"ఓరి నీ కోపం మండా! వరదలా ముంచుకొచ్చిందే!"

"సచ్చిపోతున్నాడ్రా ఎదవ-ఏమయిపోయిందిరా - ఇంతసేపూ నానేవు కాదూ, ఇప్పుడు మొక్కయి పోతావా?"

"కోటీ, నీళ్ళు పోసుకుని ఎన్నాళ్ళయిందిరా-ఎల్లి ఒక నిమిషం తడు. వొళ్ళు సల్లబడతాది. కుళ్ళొదిలి పోతాది" అని మళ్ళీ ఐదారు చేతులు వర్షంలోకి నెట్టాయి.

కోటికి వొళ్లు మండింది. బలహీనులకు కోపమొస్తే ఏడుపు కూడా వస్తుంది. దాంతో ఏడ్చాడు.

వర్షంలో నానిపోతున్నాడు. వణికి పోతున్నాడు. ముందుకి రాలేడు; వెనక్కిపోలేడు. బాధ భరించలేక పోతున్నాడు. వర్షంలో రాయిలాగ నిలబడ్డాడు.

షెడ్డు ముందు జరుగుతోన్న దృశ్యం వర్షపు తెరల్లోంచి కనిపిస్తోంది హోటల్లో వాళ్ళకి.

"కోటీ, జోడు కడిగేయరా. నాయిన్నాయినా, ఎలాగూ తడిశావు గదా?" అని కండక్టర్ కోటి గుండెమీదికి దెబ్బ తగలాలన్నట్టుగా జోడు విసిరాడు. ఆ జోడుకు అంటుకున్న బురద కాస్త కోటిగాడి తడిసిన చొక్కాకి అంటుకుంది.

"ఇది కూడా" అని రెండోదీ విసిరాడు. కళ్ళల్లోని కన్నీరు వల్నా, వర్షపు నీరు కళ్ళల్లోకి కురుస్తోండడం వల్నా ఆ రెండో జోడు తనమీదికి రావడం కనిపించలేదు కోటికి తిన్నగా. అది వచ్చి బుగ్గమీద గట్టిగానే తగిలింది.

కోటి ఆ రెండు జోళ్లూ అందుకుని, దూరంగా, బలంగా విసిరేశాడు.

"నర్సింగులూ, కోటిగాడు ఆ జోళ్లయిసిరేశాడు. హైస్కూల్లో పడినట్టున్నాయి. ఎల్లితీసుకురా" అని కండక్టరు నర్సింగుల్ని తరిమాడు, నర్సింగులు నవ్వు ఎందుకు నవ్వుతున్నాడో తెలీదు గాని నవ్వుతూనే వెళ్లిపోయాడు, గొడుగేసుకుని.

ఈ అల్లరంతా సారథి, హోటల్లోంచి, వూగుతోన్న వర్షపు తెరల్లోంచి చూస్తున్నాడు.

"ఎందుకలా హింసిస్తున్నారు, రాక్షసంగా?" అనుకున్నాడు బాధపడి. మొదట్లో కోటి తనకి తెలిసినవాడిలా కనబడ్డాడు. తర్వాత కోటి పోలికలు దూరమై పోయాయి. ఐనా ఆ పోలికలున్నందు వల్లనో, లేక వాళ్లు హింసిస్తున్నందువల్లనో సారథికి జాలికలిగింది.

కోటి గొణుక్కుంటూ మర్రిచెట్టు కిందికి వెళ్ళిపోయాడు. అక్కడ తడిసిన చొక్కాని పిండుకున్నాడు. పేంట్ ని మడత పెట్టుకున్నాడు. పిండిన చొక్కాతో వొళ్లు తుడుచుకున్నాడు, దిక్కులేని చూపులతో, బాధపడుతో ఆ చెట్టుచాటునే నుంచున్నాడు. కోటి మీద హోటల్ పంచన రిక్షాకోసం చూస్తున్న అమ్మాయికి సానుభూతి కలిగింది. బహుశా తడిసిన బాధవలన, అందరు మనుష లుండీ సహకరించలేని పరిస్థితివలన మనుషుల మీద కోపంతోనూ, ఆ మనుషులు వాడిని హింసిస్తున్నందువలన వాళ్ళ మీద అసహ్యంతోనే కోటి మీద ఆమెకి సానుభూతి కలిగి ఉంటుంది.

హోరున కురుస్తూ నిమిష నిమిషానికి ఉధృత మౌతోంది వర్షం.

కోటి వొంటిమీద చొక్కా లేదు. అనారోగ్యంగా ఉన్నాడు. పాతికేళ్ళుంటాయేమో! పాపం ఎందుకో ఇంత దిక్కులేని స్థితి! తల్లీ తండ్రీ లేరు కాబోలు. అన్నా అక్కా లేరు కాబోలు. ఎవరూ లేరు కాబోలు. ఏమీలేదు కాబోలు. తిండి ఎలాగో! నిద్రెక్కడో! ఎవరు ఏమిస్తారో! ఎలా బతుకుతున్నాడో! ఎవరు వోదారుస్తారో! ఏమిటో పాపం, ఇలాంటి బ్రతుకు అనుకుందామె.... అంతలోనే వాళ్ళాయన బస్సుదగ్గరకు రానందుకు కోపమొచ్చి గాబోలు ఆలోచనలు యింకో వేపుకి వెళ్ళిపోయాయి.

తను అనుకున్న "తన మిత్రుడే" అయితే అలాగే ఉండనిచ్చే వాడా? అనుకున్నాడు సారథి. మళ్ళీ తనకి మిత్రుడేనేమో ఇతడు అనుకున్నాడు.

నర్సింగులు జోళ్లు రెండూ పట్టుకుని, గొడుగున్నా వర్షపు ధాటికి తడిసిపోతూ షెడ్డుచేరుకున్నాడు. నవ్వుతున్నాడు. "ఎక్కడ పడ్డాయనుకున్నావు? ఆ వరండాలో ఒకటి. జండాకొయ్య దగ్గ రిం కొకటి. కోటిగాడికి మంచి బలముందే!" అని వాడినవ్వు.

"నర్సింగులూ, తడిసి పోయావురా!" అని కండక్టరు జాలి చూపించేడు. మళ్ళీ అంతలోనే "ఆఁ, ఎలాగూ తడిశావు గదా! గొడుగు బాబు కిచ్చేసి, దొంగచాటుగా యెల్లి, ఆ పిండుకున్నాడు చూడూ—ఆ చొక్కా పట్టుకొచ్చీ" అని మరొక సిగరెట్టు వెలిగించాడు.

చెట్టుచాటున నక్కినక్కి నర్సింగులు వెళ్ళడమూ, గద్దలా ఆ పిండుకున్న చొక్కా ఎత్తుకుపోవడమూ, కోటి వెంబడే తెగించి పరు గెత్తడమూ, వర్షంలో తడిసి షెడ్డు చేరుకోవడమూ, నర్సింగులు తన చేతిలోని చొక్కాని కండక్టరు చేతిలో పెట్టి డ్రైవర్ చాటున నుంచో వడమూ, తిట్టుకుంటూ డ్రైవర్‌ని ఓ పక్కకి నెట్టేసి "ఎముకలు చిదగ్గొడతా నుండు గుడ్డివెధవా! దొరక్కపోతావా! ఈ డ్రయివరూ రక్షించలేడు-ఆకండక్టరూ రక్షించలేడ్రా-ముందు చొక్కా యివ్వవో

అని కండక్టరు మీద పడ్డమూ, కండక్టరు చొక్కాని డ్రైవర్ వేపు విసురుతున్నట్టుగా నటించి బయటి వర్షం బురద నీట్లోకి విసిరేయడమూ కళ్లుమూసి తెరచినంతలో జరిగిపోయాయి.

కోటి కెంత కోపమొచ్చిందో మరి, "ఇదిగో యీ పేంట్ కూడా విసిరేయండ్రా" అని బొత్తాయీలు విప్పేయబోయాడు.

"విప్పరా, విప్పరా" అన్నాడు నర్సింగులు. కుక్క కుయ్యో మొఱ్ఱోమని ఏడుస్తుంటే నవ్వినట్టుగానే నవ్వాడు.

కోటి ఈసారి బయటికే ఏడిచేశాడు. ఆ చొక్కా పట్టుకుని మఱ్ఱిచెట్టు కింది కెళ్ళిపోయాడు.

వర్షం హోరున కురుస్తోనే ఉంది.

అంతలో ఓ రిక్షా వచ్చి ఇద్దర్ని హోటల్లో దించి ఆ అమ్మాయిని ఎక్కించుకుని వెళ్ళిపోయింది.

ఐదు నిమిషాలు గడిచాయి. మళ్ళీ కోటి చొక్కా పిండుకున్నాడు. వొళ్ళు తుడుచుకున్నాడు. తల ఒత్తుకున్నాడు. అలసటతోనే నుంచున్నాడు మఱ్ఱిచెట్టు చాటున.

"బాబూ, గొడుగొకసారియ్యండి- యిప్పుడే పంపిస్తా" అని కండక్టరు పాసింజర్‌దగ్గర గొడుగు తీసికొని స్టాండులో నిలచిన నీళ్ళను తన్నుకుంటూ మఱ్ఱిచెట్టు కిందికి కోటి దగ్గరికి వెళ్ళాడు. కండక్టరుని చూట్టంతోనే గజం వెనక్కి తగ్గాడు కోటి.

"నేనేమీ చేయన్రా—తల్లితోడు—నేనేమీ చేయన్రా-తల్లితోడంటే నమ్ము-రా రా, ఇంద, గొడుగులోకి రా, టిఫిన్ చేద్దువుగాని! రారా" అని ప్రేమ ఒలికే పలుకులు వినబడేసరికి కోటికి తియ్యని ప్రాణ మొచ్చినట్టయింది. 'తల్లితోడు' అనేసరికి కండక్టరు మాటల మీద అనంతమైన విశ్వాసం ఏర్పడిపోయింది. "టిఫిన్ చేద్దువుగాని" అనేసరికి వాళ్ళు పెట్టిన హింసంతా మాయమైపోయింది.

జాలి చూపులు చూశాడు. దిక్కులేని చూపు లవి. ఆకలి చూపు లవి.

ఆ చూపులకు కండక్టరు మరింత కరిగిపోయాడు.

కాఫీహోటల్లో ఎవర్నీ చూడలేదు కోటి. వెళ్ళి కండక్టరుతో ఓమూల కూచున్నాడు.

కండక్టరు కావలసినవన్నీ అడిగి, బలవంతంచేసి కడుపు నిండా తినిపించాడు. కోటి కడుపు నిండిపోయింది.

డ్రైవర్ అంతలో వచ్చి "ఆ బాబు గొడుక్కావాలంటున్నారు." అన్చెప్పి, కండక్టర్ కోటికి టిఫిన్ తినిపించడం చూసి, తనకీ యిప్పించాలి అనిపించి "ఒరే కోటీ, నావాంతు నాలుగు పెరుగ్గారెలు—" అని సర్వర్‌కి ఆర్డరిచ్చి కోటి పక్కనే కూచున్నాడు.

డ్రైవర్‌కీ, కండక్టరుకీ కోటిమీద జాలి కలగటానికి కారణాలు ఉన్నాయి. వాళ్ళిద్దరిదీ ఆవూరు కాదు. కాని బస్సు నైట్‌హాల్ట్ ఆ వూళ్ళోనే. అందుచేత వాళ్ళు అక్కడే అద్దె ఇళ్ళలో ఉన్నారు. ఆ ఇళ్ళలో అవసరాలన్నీ మార్కెట్‌నించి తీసుకుపోయి యివ్వడం, కబుర్లేవన్నా వుంటే చెప్పడం, బస్సునించి తీసుకెళ్ళాల్సినవేవన్నా ఉంటే తీసుకెళ్ళడం కోటిపని. ఆ రకంగా వాడొచ్చినప్పటినించీ, ఆ స్టాండ్‌లోని బస్సుస్టాఫ్ వాళ్ళకి పనికొచ్చినవాడయ్యాడు. ఒక్కోసారి ఒక్కోరు భోజనానికి తీసుకెళ్తారు. లేకపోతే టిఫిన్‌కి డబ్బులిస్తారు. లేకపోతే తాము తినేదాంట్లోనే కొంచె మిస్తారు. వాడు వచ్చి సంవత్సరమవుతున్నప్పటికీ అలాగే బతుకుతున్నాడు. ఒక్కోసారి ఒకటి రెండుదినాలు ఏ లారీలోనో, ఏ డ్రయివర్‌తోనో వెళ్ళిపోయి వస్తుంటాడు. వాడికి ఇల్లులేదు, వాకిలిలేదు. వాడికి ఎవరున్నారో, ఎవరు లేరో తెలీదు. ఎవరికీ చెప్పలేదు. ఎవరూ తెలుసుకోవాలని ప్రయత్నం చెయ్యలేదు కూడా. భార్య చచ్చిపోయిందనీ, కొడుకు చచ్చిపోయాడనీ, తమ్ముడున్నాడనీ, తమ్ముడి దగ్గరే తల్లి ఉన్నాదనీ, వాళ్ళంతా చాలా దూరంలో సుఖంగానే ఉన్నారనీ చెప్పడానికి వాడికి సిగ్గు. అభిమానము. అందుచేత చెప్పుకోలేదు. తన అసమర్థతనంతా

అసహ్యించుకున్నారు. అంచేత అతడికి తన గురించి చెప్పుకోవడం కూడా భయమే.

డ్రైవర్ బలవంతం చేస్తోంటే. "కడుపు నిండిపోయింది. ఇంక తిన్లేను" అన్నాడు భయం భయంగా.

"సరిసర్లే. తినుతిను. తంతాన్లే కపోతే" అని అభిమానం కూడా మెత్తగా మంచిగా ప్రకటించలేని డ్రైవర్ బలవంతం చేశాడు. తిట్టి, కొట్టి, తన్ని ఎలాగయినా తినిపించేట్టున్నాడు డ్రైవర్. విడిచిపెట్టేస్తే ఊరుకోడు. తింటోంటే డోకు వచ్చినట్లు అవుతోన్నా తింటున్నాడు కోటి.

వర్షం జలమయం చేసేసింది ప్రకృతిని.

కోటి తింటూ తింటూ డోకు వచ్చి బయటికి వెళ్ళి పంచన వాంతి చేసుకున్నాడు. డ్రైవర్ యిన్ని నీళ్ల యిచ్చాడు కోటికి. నోరంతా చేదుచేదు అయిపోయింది. నరాలన్నీ వణికిపోతున్నాయి. తలనొప్పి మొదలైంది. కాళ్ళు కంపించిపోతున్నాయి. నీరసంగా పంచన గోడకి చేరగిలబడి కూలబడ్డాడు.

బస్సువేళయి కండక్టరూ, డ్రైవరూ వెళ్ళిపోయారు. కృపాసింధుతో ఏమిటో చెప్పినట్టున్నారు.

ఇంకో బస్సు వచ్చి ఆగింది. జనం దిగారు వర్షంలోనే.

ఆకాశం నల్లని మేఘాలతో నిండిపోయి జోరుగా వర్షం కురుస్తోంది.

ప్రవాహం కడిగేసింది కోటిఆకలి తీర్చిన ఆహారాన్నంతటినీ....

కోటి చూపులు నీరసంగా ఉన్నాయి. కళ్ళు తెరవడం బాధగా ఉంది. అక్కడే పడిపోయి నిద్రపోవాలని ఉంది. కాని పంచంతా

తడిసిపోయిఉంది. ఆ నీరసమైన చూపులకే ఎదురుగా బస్సుదగ్గర్లో ఏభై యేళ్ళ ఒకామె కనబడింది. వానలో తడుస్తోంది. ఆమెతో పాటు బరువుంది. ఆ బరువు మోయటానికి ఎవరూ కనిపించలేదు. కింద నీరు. మెరగ్గా ఉన్నదగ్గర ఒక మూట పెట్టి ఇంకో మూట గుండెల్లో దాచుకుంది.

కోటి ఆమెను చూసి, ఆమె పరిస్థితి అర్థంచేసుకుని వెళ్ళి,ఆమె మూట అందుకుని "రా అమ్మా రా, ఆ పంచలోకి రా" అని ఆమె కళ్ళల్లోకి విచిత్రంగా, వింతగా, కొత్తగా, ఆశతో, భక్తితో చూసి హోటల్ వేపు నడిచాడు.

*　　　　　*　　　　　*

బస్ కదిలిపోయేముందు సారథికి అనిపించింది. తను ఎందుకు కోటికి సహాయం చేయలేకపోయాడు? వాడు తెలిసికూడా తెలియనట్టు ఎందుకు నటించాడు? లేక నిజంగా వాడు ఎవరో తనకి తెలీదా? డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీస్‌లోని రామ్మూర్తి అన్నయ్యేగదా కోటి? అయినా తను ఎందుకు పలకరించలేకపోయాడు?

"ప్రపంచంలో చాలామంది కష్టపడుతున్నవాళ్లున్నారు" అని తనని సంతృప్తి పరుచుకున్నాడు, కొంతసేపు మానసికంగా బాధ పడిన తర్వాత సారథి.

---